# ది స్మోకింగ్ టైగర్ అను పులి పూజ

"పులి మజా గొర్రెకి ఎక్కణ్ణించొస్తుందయ్యా? పులి పులే గొర్రె గొర్రే" అని ఓ రోజున భూపతి చాలా వెటకారంగా అన్నాడు, గొర్రెని నా దగ్గర ముష్పత్‌గా తీసుకు కాలుస్తూ.

అందుగురించే నాకూ ఆయనకి బెడిసిపోయింది. అందువల్లనే నేనాయన్ని ఆరోజుల్లో కాంగ్రెసువాళ్ళు ఇంగ్లీషువాళ్ళని చూచినట్టుగా చూడ్డం ప్రారంభించేను. నా కళ్ళు ఆయన యెడల మైక్రోస్కోపులుగా మారిపోయి ఆయన్లోని తప్పులన్నీ భూతాల్లా చూడ్డం మొదలుపెట్టేయి.

ఆయన పూర్తి పేరు భూపతి కరుణాకరరావు. "తమరి పేరు" అని ఎవరయినా అడిగితే 'నన్ను భూపతంటారు' అని జవాబిచ్చేడాయన. ఆయనతో నాకు ఎలా ఎప్పుడు పరిచయం అయిందో సరిగ్గా చెప్పలేను. ఆ వూరు వెళ్ళినప్పుడల్లా మాత్రం ఆయన్ని నేను కుసుమహర విలాస్ కాఫీ హోటల్ దగ్గర కలుస్తూండేవాణ్ని. లేక ఆయనే నన్ను కలుస్తుండేవాడేమో చెప్పలేను. ఆయనెప్పుడూ ఆకలితో ఉన్నట్టు కనిపించేవాడు కాదు. బోర్లించిన కుండలా గంభీరంగా కనిపించేవాడు. కాని ఆయన్ది ఏనుగు దాహమూ, రాక్షసపు టాకలీను. ఆయనకి కాఫీ టిఫినూ ఇప్పించడం నా పర్సుకి కష్టంగా ఉండేది కాదు. నా మనసుకి ఇష్టంగానే ఉండేది. ఆయన్ని చూసి నేను జాలిపడేవాణ్ని.

ఆయనతో జట్టీకి దిగడానికి నాకు కలిగిన కారణం సబువైన కారణం కాదేమో?! ఆయన్ని చూసి ఆ రోజున నేను అసహ్యించుకోవడం సబువు కాదేమో? ఆయన్ని చూసి జాలిపడ్డమే న్యాయం ఏమో?

ఆయన కప్పటికప్పుడే అరవయ్యేళ్ళు దాటి ఏ నాలుగైదేళ్ళో అయివుండవచ్చు. వడిలిపోయినప్పటికీ బలంగా కనిపించేవాడు. బలంగా కనిపించినప్పటికీ అసహాయంగా వున్నట్టుండేవాడు. ముఖం గజం చదరం ఉండి, అతను చాలా ఎత్తుగా వెడల్పుగా ఉండేవాడు. చాలా పళ్ళూడిపోయేయి; దవడలు ముడతలుపడి సంచుల్లా వేళ్ళాడేవి. కారా కిళ్ళీవల్ల నోరు ఎర్రగా ఉండి, నవ్వినప్పుడు నాలిక ఎర్రగా కనిపించేది. ఆ నోరు, పళ్ళులేని పామునోర్లా ఓసారి నా కంటికి తోచింది. "ఛీ పాపం! ముసలాణ్ని పాముతో సరిపోల్చడం చాలా తప్పు!" అని నన్ను నేను చాలా నిందించుకున్నాను. అతనెప్పుడూ ఓ మాసిన పంచెమీద మాసిన చొక్కా వేసుకొని అంచుమీద ఓ మాసిన ఖాకీకోటు తొడుక్కొని ఉండేవాడు. చేతిలో తరచుగా ఓ పోకైనా చేతికర్ర మాత్రం ఉంటూండేది. ఆ చేతికర్రవల్లనో మరెందువల్లనో గాని ఆయనొక చెడిపోయిన రాజుగార్లా ఉండేవాడు. ఆ చేతికర్ర ఊతే లేకపోతే అతను ముష్టికి దిగిపోయిన ముసలి రాక్షసుల్లాగా, పొట్లకాయలు నవులుకొని పొట్టపోషించుకొనే ముసలి పులిలాగో కనిపించి వుండేవాడు.

అతను చిన్నప్పుడు ఇంట్లోంచి పారిపోయి, మిలటరీలో చేరిపోయి యుద్ధం చేసినట్టుగా లేదు - దేశ సంచారం చేసేట్ట, అలనాటి తన అనుభవాల గురించి, ముఖ్యంగా తన ఆడవేట గురించి చెప్పినప్పుడు అతను టపాకాయల్లా లొట్టలు వేసేవాడు. అతనికి తినడం అంటే ఎంత ఇష్టమో పని చెయ్యడం అంటే అంత యిష్టం. ఫలానావారు కష్టపడి పని చేస్తారని మనం అంటే 'అవునవును. రోజల్లా గొడ్డు చాకిరి చేస్తాడు. ఓ సరదా సంబరం ఏం లేదు. గొడ్డులా కష్టపడ్డవే! ఎందుకా ముష్టి బతుకు?' అనేవాడు. కాని కష్టపడి పని చెయ్యవలసినవాళ్ళు కష్టపడి పని చెయ్యకపోతే ఆయన మండిపడేవాడు. "తుచ్ఛపు యెధవలందరికీ తుంటరితనం లావైపోయి బద్ధకం బలిసిపోయింది. ఒళ్లొంచి కష్టపడ్డు యెధవలు!" అని సరిగా పని చెయ్యని వాళ్ళని తిట్టేవాడతను. అతనికి కుస్తీలు, సర్కసులూ, సంబరాలూ, సినీమాలు, నాటకాలూ, పెళ్ళిళ్ళూ, మేళాలూ భజన్లూ, వేటలూ, విందులూ అంటే ఎంతో ఇష్టం. దుస్తులు కూడా ఎంతో ఖరీదుగా దర్జాగా వుంటే అతనికి అంత ఇష్టం.

లోకంలో మనుష్యుల్ని రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకరు : టోపీ వేసేవారు. రెండు : టోపీ వేయబడేవారు. టోపీ వేసే రకాన్ని చూస్తే భూపతికి ఇష్టంలా నాక్కనిపించింది. మానవులు లోకంలోని అనేక రకరకాల విషయాల్లోంచి హాస్యరసం లాగి ఆనందిస్తారు. ఎవరైనా ఎవరికైనా ఎంత చక్కగా టోపీ వేస్తే అంత హెచ్చుగా ఆనందించేవాడు భూపతి. టోపీ వేయబడిన వారి గురించి తల్చుకు తల్చుకు నవ్వేవాడతను.

నాకు భూపతితో పరిచయం అయాక ఆ వూరికి దగ్గరగా వుండె పల్లెటూళ్ళో ఓసారి ఓ ఘోరం జరిగింది. ఓ పెద్దింటి రైతుభార్య ఆ రైతుకి తెలియకుండా చాలాకాలం మరొక పెద్దింటి మొఖాసాదారుడి కుమారరత్నంతో అక్రమ సంబంధం పెట్టుకొందిట. ఆ సంగతి ఓ రోజున అకస్మాత్తుగా ఆ రైతుకి తెలిసీ తెలియగానే అతను తిన్నగా పల్లిగ్గా వెళ్ళి ఆ మొఖాసాదారుడుగారి శృంగారపు టబ్బాయిని గండ్రగొడ్డల్తో ముక్కలు ముక్కలుగా నరికేసేట్ట. ఆ విషయం గురించి జనం అంతా అదే చెప్పుకోవడం చెప్పుకున్నారు. జనం సింపథీ అంతా ఆ రైతుబిడ్డ యందే ఉన్నదని నేననుకున్నాను. చచ్చిన ఆ శృంగారపుటబ్బాయిని ఎవరైనా వెనకేసుకు వస్తారని నేననుకోలేదు.

భూపతిగారు మాత్రం రైతుబిడ్డ యెడల తీవ్రమైన కోపం వహించేరు.

"దుర్మార్గ వెధవ! ఏం, ఆడి పెళ్ళాన్ని ఆడు సరిగ్గా సాక్కోకూడదా. చూసుకోకూడదా? కావలిస్తే కాపలా ఎట్టుగోకూడదా? ఒద్దన్నవాడెవడు? రేత్రీ పొగలూ కూడా గంటీ సోడీ మొక్కాజొన్నా సేనూ పాదూ గడ్డీగాదా అనుకొంటూ ఊరవతల ఏడిచే యెధవకి ఆడదాన్ని అనుభవించడం ఏం తెలుస్థి? ఆడికి చాతకానప్పుడు పరకులు తెలిసినవాడు ఛాన్సు కొట్టేడంటే ఊడిదా ఆడిదా తప్పు? ఆడదాన్ని అదుపులో పెట్టుకోలేనోడు ఎళ్ళి గొడ్డల్తో బుర్రలు కొట్టేస్తాడా? ఏంటండి ఆడి దౌరిజన్యం?! అలాటాళ్ళని ఊరిమీదిడిచి పెట్టేస్తే ఇంకేంటైనా ఉంటదా? రేపు పక్కింటాడి కుక్క నన్ను కరిసిందంటాడు; లేపోతే మరెందుకో కోపం ఒచ్చిందంటాడు: మరెవుడి బుర్రో ఎగరగొట్టేస్తానంటాడు. యెధవని ఎలాగాపడం? అయితే, పోలీసోళ్ళూరుకోర్లెండి. చమ్డా లెగరగొట్టేస్తారు. కోర్టులో ఎలానూ శిచ్ఛయిపోద్ది. ఉరి కాయం! అవాల్లెండి ఒక యెధవకి

బుద్ధి సెప్తె కాని ఇంకో యెధవకి బుద్ధిరాదు. మెరిసిలెస్‌గా ఉండాల. గొడ్డలికి గండ్రగొడ్డలే జవాబు!"

భూపతిగారు చాలా కోపంగా తనే ఆ శృంగారపుటబ్బాయి అయినట్టు మాట్లాడేరు హోటల్లో. నేను అనుకోనంతమంది ఆయన్ని సపోర్టు చేసేరు.

భూపతిగారు మిలటరీనుంచి వచ్చేక రెయిల్వే సర్వీసులో చేరేరట. ఖాకీ కోటు వెయ్యనపుడు, బొగ్గు రంగుగా మారిన నీలంకోటు వేసేవాడాయన. రెయిల్వే సర్వీసులోంచి ఆయన రిటైరే అయేడా, లేక డిస్మిస్ అయేడా? ఆసంగతి ఎవరికి తెలుసో నాకు తెలియదు. ఆయన భార్య ఆయన నడికాలంలో ఉండగానే, కిరసనూనె పోసుకు కాల్చుకు చనిపోయిందట. ఆయనకి కొడుకులు లేరనీ, ఒక్కర్తే కూతురనీ, ఆమె పెనిమిటి ఎక్కడో టీచరనీ ఆయనే చెప్పేరు నాకు. అల్లుడంటే (టీచరే అని కాబోలు) ఆయనకి గౌరవం లేదని మాత్రం నేను గ్రహించేను.

భూపతిగారు చాలా కష్టదశలో ఉండేవారు. ఆ విషయం ఎదటివారి కంటికి సుస్పష్టంగా కనిపించేది. ఆయన్ని మొదట్లో చూసినప్పుడు, ముసలి దశరథుడు ఇలానే ఉండేవాడేమో అనిపించింది నాకు.

కాని, రానురాను ముసలి దశరథుడెగిరిపోయి ఆయన్లో నాకు ముసలి పిల్లి సాక్షాత్కరించింది. ఆ మార్పు ఎప్పుడు జరిగిందో నేను స్పష్టంగా చెప్పలేను. ఆయన కళ్ళు పెద్దవే అయినప్పటికీ వాటిని చిట్లించుకు చూసేవాడతను. ఆయన కెల్లప్పుడూ వారంరోజుల పండుగడ్డమూ పండు మీసమూ ఉండేవి. కారాకిల్లీ ఎరుపుతో అతని నోరు ఎలకని తిన్న పిల్లి నోర్లా ఉండేది. మానవాకారాల్లో అడుగున జంతువులు దాగొని ఉంటాయనేది అందరికీ తెలిసిన విషయమే. ఒంటెలూ ఏనుగుల్లాగా, కుక్కలూ నక్కల్లాగా, లేళ్ళూ లేగదూడల్లాగా ఉండేవాళ్ళు మనకి కనిపిస్తూంటారు. ఆ విధంగా చూస్తే భూపతిగారు, చెడిపోయిన గండుపిల్లిలా ఉండడమే కాకుండా వారం రోజుల్నించీ స్నానం చెయ్యని గండుపిల్లిలా ఉండేవారు. పాపం, అతను చాలా అపరిశుభ్రంగా చూస్తే ఎవరికైనా సరే జాలి కలిగేలా ఉండేవాడు.

ఆయన స్థితి చూసి జాలిపడి నేను మా కంపెనీ సరుక్కి అన్ అఫీషియల్ కాన్వాసర్‌గా నా ఎంటిర్‌టేన్‌మెంట్ అక్కౌంటులోంచి కొంత డబ్బు అప్పుడప్పుడు అతనికి ఇస్తూండేవాణ్ణి. అతను కృతజ్ఞుడుగానే ఉన్నట్టుగానే కనిపించేడు. మేం ఇద్దరం చాలా స్నేహంగానే ఉండేవాళ్ళం. కాని చివరకి పులి దగ్గరే మా యిద్దరికి బెడిసిపోయింది.

పులుల్ని ప్రేమించడమా మానడమా అనే సమస్య జీవితంలో సాధారణంగా ఎవరికైనా ఎదురవుతుందని నేననుకోను. పులంటే లడ్డూ కాదు. చెగోడీ కాదు. పెళ్ళికూతురు కాదు, పొలికటికల్ పార్టీకాదు. పులి యెడల నా "ప్రేమని" టెస్టు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని నేనెప్పుడూ అంతకు ముందు అనుకోలేదు. కాని ఆ సమస్య నాకు పెద్దపులిలా ఎదురయింది.

నా పద్దెనిమిదో యేట నేను ఎసెసెల్సీ పాసయి ఓ బ్రిటిష్ సిగరెట్ మాన్యుఫ్యాక్చరింగ్

కంపెనీలో ఏజెంటుగా చేరేను. భూపతిగార్ని ఆ వూళ్ళో కలిసేసరికి నాకు నాలుగేళ్ళ సర్వీసయింది. మా సిగరెట్లు గొర్రెమార్కు సిగరెట్లు. పందెప్పొట్టేలు మా పెట్టెల మీద మాంచి ఫోజులో నిలబడేది. ఆ రోజులు బ్రిటిషువాడు అట్లాసులో సగం భాగానికి (రేవుకి వేసినా చెరగదా అనిపించేటటువంటి) ఎర్రరంగు పులిమి పులిమి ఉంచిన రోజులవి. కాని అవి గాబా చవకరోజులు. శేరు బియ్యం బేడే అయినప్పుడు అణా ఖరీదుగల సిగరెట్లు హైక్లాస సిగరెట్లన్నమాట. మావీ పది గొర్రెలూ పదణాలు. వైస్రాయిలూ గవర్నర్లూ కాల్చినా కాల్చకపోయినా కలెక్టర్లూ, కమీషనర్లూ మా సిగరెట్లే కాల్చేవారు. పెళ్ళి విందుల్లోనూ, పిక్నిక్ పార్టీల్లోనూ కమ్మగా కమ్ముకొని వుండే వాసన మా గొర్రెవాసనే. ఎక్కడికి వెళ్ళినా మా గొర్రెకి మాంచి గౌరవం పలుకుబడీ వుండేవి. మర్యాదా మన్ననా లభించేవి. హై సొసైటీ గుమ్మాలన్నీ మా గొర్రెకి సుపరిచితాలు. అన్నిచోట్లా దానికి ఘనసత్కారాలు! ఏజెంటుగాణ్నే అయినప్పటికి నేనో పెద్ద చాంపియన్ గొర్రెలా తిరుగుతుండేవాణ్ని. కలెక్టర్‌గారి బంట్రోతు తాశిల్దారి కచేరీకి వెళ్ళినట్టు నేను అతి దర్జాగా అన్నిచోట్లకీ వెళ్ళిపోతూ గొర్రె పానుమీద గౌరవం పొందు తూండేవాణ్ని.

కాని, ఎల్లకాలమూ ఒక్కలా ఉండదని నేను తెలుసుకోలేకపోయేను. సముద్రంలోంచి బంగారు బిందెలా లేచిన సూర్యుడు సాయంకాలానికల్లా రాగి సిబ్బిలా మాడిపోతాడనే కటిక సత్యం కళ్ళముందే రోజూ జరుగుతున్నా నేను కానుకోలేకపోయేను. అలనాటి బ్రిటిషు సింహం ఈనాడు జూలు గొరిగించుకుని తోక ముడుచుకొని అమెరికా వారి అరువు తిండిమీద చావాలేక బతకాలేక అవస్థ పడుతుందని ఎవరనుకున్నారు? అదే విధంగా ఎంతటి కొమ్ములిరిగిన ఛాలెంజ పొట్టేలయినా ....

మా గొర్రెకి చరమదశ ఓ రోజున ఓ ప్రముఖ పత్రికలో ఖాళీ పేజీతో ప్రారంభమయింది. పేజీ పేజంతా ఎందుకు ఖాళీగా ఉంచేసేడా అని అందరం ఆశ్చర్యపోయేం. ఆ మరునాటి (అదే) పత్రికలో ఆ పేజీ మధ్య ఓ కొశ్చన్ మార్కు పడింది. "ఈ ప్రశ్నార్థకం ఎందుకు?" అని మేం ఆలోచిస్తే, "జవాబు రేపు ఎల్లుండి అవతలనాడూ చూడండి!" అని అందులోనే ఓ వార, నవ్వే అక్షరాలు మమ్మల్ని పలకరించి జవాబు చెప్పేయి. ఆ మర్నాడు ఆ ఖాళీ పేజీ మధ్య ఆ ప్రశ్నార్థకానికి బదులు ఓ చల్లని చెట్టు బొమ్మ ముద్రించబడింది. ఆ చెట్టు ఎంత చల్లగా ఎంత సహజంగా ఉందంటే, "ఒరే! దీనికిందే మేం చిన్నప్పుడు గొట్టికాయ లాడుకొనేవాళ్ళం!" అని మీరనేటంత సహజంగా ఉంది. ఆ తరువాతరోజు ఆ చెట్టుకింద ఓ పిడుగువంటి పెద్దపులి పచ్చటి పసుపురంగుతో ముచ్చటగా మనోహరంగా గంభీరంగా కూర్చొని చక్కగా ఓ సిగరెట్టు చల్లగా కాలుస్తూ మాకు ప్రత్యక్షమయింది. ఆ మరుచటిరోజున

**"ది స్మోకింగ్ టైగర్"**

అనే ముత్యాలవంటి అక్షరాలతో ఆ పులిబొమ్మ చుట్టూ ఓ సిగరెట్టు పెట్టె తయారయింది.

ప్రజలంతా గొప్పగా ఉందంటే గొప్పగా ఉందన్నారు.

రంగంలోకి బాంబు దిగినట్టు పులిమార్కు సిగరెట్టు ఆ విధంగా మార్కెట్టులోకి దిగింది.

అది అడ్వర్టయిజుమెంటు కాదు. పిడుగుల వర్షం. మారణ యుద్ధం. అవి స్లోగన్సు కావు. మర ఫిరంగులు. మెషిన్ గన్సు.

"పులి! పులి! పులి?"

"పదణాలకి పది పులులు!"

"అణాకొక పులి. అద్భుతం కదూ?!"

"జేబులో పులి గుండెకి ధైర్యం"

"నోట్లో పులే నవరాజ చిహ్నం"

"పులిని వేటాడకండి! ఏ షాపులో
అయినా అడగండి! కొనండి"

"పులిని చంపకండి! దాన్ని కాల్చండి!"

"వగలెరిగిన వనితలు మిమ్మల్ని వాంఛిం
చాలంటే పులితో మీరు ప్రత్యక్షమవండి!"

"సింహాల్లో బ్రిటీష్ సింహం! సిగరెట్సులో
టైగర్ సిగరెట్?"

"ఒక పులికి పది పులులు ఉత్సాహం?"

"పులిని కాల్చిన ఖర్చు మీ భాగ్యానికి మదుపు"

"పెట్టెడు పులులు పట్టుకోండి!
అడవిలో పులిలా మీకు మరింక ఎదురుండదు."

"పులి దర్జా పులిదే!"

"పులిని కాల్చినవారు రాజులు కారా మరి!"

ఇటువంటి కొత్తకాలం మారణాయుధాల్తో అధర్మ యుద్ధానికి స్మోకింగ్ టైగర్ దిగిపోవడంతో మా గొర్రె దెబ్బతింది. అంతేకాదు వాళ్ళు ప్రయిజులు, లాటరీలు, ప్రశ్నలు, జవాబులు, బొమ్మలు, కాలెండర్లు, ఆ కాలెండర్లమీద లైలా, రంభ, జూలియట్‌లవంటి మోహనాంగులు గట్టిగా ఆ పులిని ముద్దెట్టుకొంటోన్న త్రివర్ణ చిత్రాలూ – ఇటువంటి ఆకర్షణలతో పులి మార్కెట్టుని పైపైకి పక్కపక్కలకీ కూడా పెంచుకొంటూ పోయేరు. ఈ అమెరికన్ పద్ధతులకి మా బ్రిటీషు కంపెనీ తట్టుకోలేకపోయింది. మావాళ్ళు వెర్రివెర్రిగా గఁవాఁర్ పద్ధతిలో వాళ్ళని ఇమిటేట్ చెయ్యబోయి, "అణాకొక గొర్రె అణాకొక గొర్రె!" అని ఓసారి అడ్వర్టయిజు చేసేరు; కాని ఆ మాటలు చదువుకొందికి వాళ్ళకే సిగ్గువేసి ఇమిటేషన్ చేసే ప్రయత్నం విరమించుకున్నారు.

మా కంపెనీ సరుకు ఆ విధంగా దెబ్బతిని, మా రింగుల కొమ్ముల పందెప్పొట్టేలు మార్కెట్టులోంచి బాజోటైపోవడం మొదలు పెట్టేసరికి నా ఉద్యోగానికి ఎసరొచ్చే పరిస్థితి ఏర్పడి, నేను చాలా చిక్కుల్లో పడిపోయేను. అయినా కూడా నాకు అప్పటికింకా పులియెడల

మాత్రం కోపం రాలేదు. ఆ కంపెనీవాళ్ళ దొంగపద్ధతులు చూచి అసహ్యించుకున్నా నంతే కాని వాళ్ళ పులిమార్కు గురించి నేను ఆలోచించలేదు. ఆలోచించి అసహ్యించుకునేట్టు భూపతి చేసేడు.

పులిమార్కు సిగరెట్టేజంటుగాడు ఎర్రగా మెరుస్తూ పంచరంగుల డ్రెస్సుల్తో పకడ్బందీగా రాజుగారి బావమరిదిలా ఉంటూ రయ్ః రయ్ఃమని తిరుగుతూండేవాడు. మానసిక సౌందర్యము హృదయ సౌందర్యము ఆత్మ సౌందర్యము - ఇటువంటివి ఉంటే ఎవరికయినా ఉండవచ్చునుగాని అవి స్పెషల్ లెన్సెస్‌తో చూస్తేనేగాని పైకి మామూలుగా కనిపించవు. శాస్త్ర సహాయం లేకుండా కంటికి కనిపించేది అవతలివాడు పర్సనాలిటి తప్ప అంతర్గత సౌందర్యాలు కనిపించవు. పులి కంపెనీవాళ్ళు వాళ్ళ నౌఖరీ టెస్టులో నూటికి అరవై మార్కులు పర్సనాలిటీకి కేటాయిస్తారట. పులిమార్కు ఏజంటుగాడు అరవై మార్కులకి అరవై మార్కులు తెచ్చుకొని టెస్టు పాసయినట్టుగా ఉండేవాడు.

"ఎక్కువవారు!" అనిపించుకొనేవారు తమలో తామే ఒకర్నొకరు తృణీకారభావంతో చూసుకోవచ్చు. సింహాలకి పులులంటే గౌరవం లేకపోవచ్చు. పులులు సింహాల గురించి, "జూలుండగానే సరా? వెధవ బోడి గొప్ప!" అని చాలా నిరసనగా మాట్లాడవచ్చు. కాని అవి "మనలో మనం ఏమనుకొన్నప్పటికీ, మనం హైక్లాసు జంతువులం" అని గుర్తించుకు వ్యవహరిస్తాయి. ఆ విధంగా ఇంద్రాణీ గార్డెన్సువాడు బృందావన్ గార్డెన్సువాణ్ని చూసినట్టుగా నన్ను చూసేవాడుకాడు. ఆ పులి మార్కు ఏజెంటుగాడు, అనకాపిల్లివాణ్ని అమెరికా వెళ్లొచ్చినవాడు చూసినట్టుగానూ, ఎస్సెల్సీ పోయినవాణ్ని ఇంటర్ ఫస్టియర్‌వాడు చూసినట్టుగానూ చూసేవాడు. అది చూసి నాకు చాలా అసహ్యం వేసేది. అదీకాక, వాడు వాడేదో దయదల్చి నన్ను బతకనిస్తున్నట్టుగా చూసేవాడు నన్ను! - అప్పుడే భోంచేసిన పాము అందాకా కప్పని ఆడుకోనిచ్చినట్టు! నేను నిజంగా కప్పని కాకపోయినా వాడు నిజంగా పామే అయినట్టుగా చూసేవాణ్ని నేను.

వాణ్ని తెగ పొగిడేవాడు భూపతి. స్మోకింగ్ టైగర్ గురించి నాకు మంచి అభిప్రాయం లేదు. భూపతి కూడా ఆంటీస్మోకింగ్ టైగర్ పార్టీలే అనుకున్నాను. మొదట్లో అలానే మాట్లాడాడు. కాని దారి మళ్ళించడం, పులేజంటుగాన్ని పొగడ్డంలో మళ్ళించేడు. అది నేను కొన్నాళ్ళకి కాని తెలుసుకోలేదు.

ఓనాడు పులిమార్కు ఏజెంటుగాడు పులిచర్మపు జోళ్ళు కొనుక్కొనివస్తే వాణ్నొక షావుకారుగారి కొట్టు దగ్గర చుట్టూ మూగి జనం చూస్తున్నారు. భూపతి కూడా అక్కడున్నాడు. నేనక్కడికి వెళ్లేక కొంత సేపుండి పులేజెంటుగాడు నాకొక పాము కప్పా చూపు పారేసి కాళ్ళెగరేసుకొంటూ పోయేడు.

నా పని కొద్ది నిమిషాల్లోనే అయిపోయింది, నేను వచ్చేస్తూంటే భూపతికూడా నాతో వచ్చేడు.

"వాణ్ని చూసేవా?" అని అడిగేడు భూపతి.

"చూసేను" అన్నాను ముక్తసరిగా.

"రంగసాని మొగుళ్ళా లేడూ!"

"ఆ మొగుడెవడో నేను చూడలేదు"

"జెల్సా పచ్చి!"

"పక్షా?"

"అణ్నీ చూసి వుడుక్కోకు! అడి అదృష్టం అడిది. బలే బాక్స్ కొట్టేడు!"

"ఏఁవిఁటి?"

"షావుకారు యెధవప్పలేదూ? కర్రిది. ముండమోపి!"

"ముండమోపా?"

"అఁ అదిప్పుడు మనోణ్ని చూసి రంగయిపోయింది." ముండ దగ్గిర మూడీశెల బంగారం వుంది! ఛాన్సంటే ఛాన్సు!" అంటూ నోరంతా తెరచి తెరచి చాచి చాచి నవ్వేడు భూపతి.

నాకు భూపతినీ, పులేజెంటునీ, బంగారపు ముండనీ - ముగ్గుర్నీ కూడా చూసి అసహ్యం వేసింది.

"ఎర్రి గొర్రెలా వుండకపోతే, నువ్వు కూడా ఓ చాన్సు చూసుకోకూడదూ!" అని ఆ లైన్‌లో వెళ్ళమని నన్ను వుత్సాహపరచబోయేడు భూపతి.

నేను చిరాకుపడి, అతన్ని విడిచిపెట్టి నడుచుకుపోయేను.

ఆ తరువాత మరో నెల్లాళ్ళకి మళ్ళీ ఆ వూరు వెళ్ళినప్పుడు మళ్ళీ కుసుమహర విలాస్ దగ్గిర భూపతి కనిపించేడు. సాయంకాలం అయిద్దాటింది. నేను చాలా శ్రమపడి తిరిగి తిరిగి సాయంకాలానికి పూర్తిగా అలసిపోయి ఉన్నాను. ఉడతలు పీకిన తాటిటెంకలా నేనుంటే స్నానం చేసిన కొండచిలువలా పులేజంటుగాడు నిల్చొని భూపత్తో మాట్లాడుతున్నాడు.

నేను దగ్గరగా వెళ్ళిన సమయానికి పులేజెంటుగాడు విరగబడి నవ్వి, భూపతి వీపుమీద తట్టి, "అమ్మ! ముసిలోడా! ఏంటో అనుకున్నాను. గట్టోడివే! ఇంకా నీక్కావాలా? సరే చూద్దాం! రాత్రి తొమ్మిదింటికి అంబికా హాలుగేటు దగ్గిరుండు!" అంటూ భూపతితో చెప్పి నాకో పిట్టా పురుగూ చూపు పారేసి, కాళ్ళూ విసురుకొంటూ చేతులూపుకొంటూ వెళ్ళిపోయేడు.

భూపతి నాతో తిరిగి హోటల్లోకి వచ్చేడు.

"వాడితో కాఫీ ఓసారి అయిందనుకో. కాని ఫరవాలేదు. నీతో మరోసారి" అంటూ లోనికి వచ్చి ఆ రోజునుంచే పులిని పబ్లిక్కుగ్గా నాముందే పొగడ్డం ప్రారంభించేడు.

పులిముందు మా గొర్రెలు మరింక నిలబడవన్నాడు. పేర్లోనే యుద్ధం పోయిందన్నాడు. అందమైన ఆడపిల్లని పిల్చి "బలే! బలే! నీకు రాముడు కావాలా, భీముడు కావాలా?" అని అడిగితే అడో ఈడో లేపోతే మరోడో కావాలంటుంది. కాని, దాన్నే పిల్చి, "బలే బలే! నీకు భీముడు కావాలా బల్లూకం కావాలా?" అంటే నూటికి నూరునూర్లూ భీముడే కావా

లంటుందిట. కాని "ఎహ్హెహ్హె! బల్లూకం కావాలంటుందా!' ట! అంచేత పులిపేరు ముందు యెధవ గొర్రెలెలా నిలబడగలవు? ట!

ఈ విధంగా సిగరెట్టూ సిగరెట్టూ యుద్ధాన్ని పులీ గొర్రెల యుద్ధంగా మార్చేసేడు భూపతి.

మా కంపెనీవాళ్ళు కాణీ ఖరీదుగల సరుకుని అణాకి అమ్మేవాళ్ళు, పులిగాళ్ళు దమ్మిడీ సరుకుని అణాకి అమ్ముతూ మార్కెట్టంతా పులిమయం చేసేయగలగడం నాకు అన్యాయంగా తోచింది. పులిదెబ్బ ఎంతటి దెబ్బో నా కపుడు తెలిసొచ్చింది.

పులి మహిమ ఎంతటి మహిమో నాకు భూపతిగాడి వల్ల పూర్తిగా తెలిసొచ్చింది. పులి గురించి నేనప్పుడు తీవ్రంగా ఆలోచించి జీవితపు సత్యాలు కొన్ని తెలుసుకున్నాను. నరుల్లో వ్యాఘ్రాలు, పద్యాల్లో శార్దూలాలూ, సిగరెట్లలో టైగర్లూ ఎందుకుంటాయో నాకప్పుడు అర్థం అయింది. అరణ్యాల్లోనే కాకుండా మానవ సంఘాల్లో కూడా పెద్దపులికొక విశిష్టమైన స్థానం ఉన్నదని నేను అనుభవం మీద తెలుసుకున్నాను.

ప్రేమకీ మోహానికీ తేడా ఏమిటో స్పష్టంగా చెప్పలేన్నేను. మేనకని విశ్వామిత్రుడు మోహించేడు. సావిత్రి సత్యవంతుణ్ని ప్రేమించింది. మోహం అంటే అదీ. ప్రేమ అంటే ఇదీ అని బోధపర్చుకున్నాన్నేను. ఆ విధంగా చూస్తే భూపతిగాడు పులుల్ని మోహించేవాడనడమే సబబుగా ఉంటుంది.

తరువాత మరో నెల్లాళ్ళకి నేను మళ్ళీ ఆ వూరు వెళ్లేను. మా కంపెనీకి ఇంక మరో ఏడాదికి నూరేళ్ళూ నిండిపోతాయన్నమాట. కొమ్ములు తిరిగిన దశ తోక ముడుపు దశకి దిగజారిపోయింది. నేను స్టేషన్లోంచి బైటకి రాగానే ఎదురుగా పెద్ద పులిబోర్డు మెరుస్తూ కనిపించింది. ఆ పక్కనే బోర్డుమీద మా గొర్రెబొమ్మ చచ్చిన గొర్రెబొమ్మలా ఆ ఉదయపు ఎండలో కూడా వెలవెలబోతూ ఉంది. ఆ చచ్చేగొర్రెనీ ఆ ప్రక్కనే మెరిసే రాక్షస్సైజు పులినీ చూచేసరికి నాకు మరీ నిరాశ అయిపోయింది. నా పని - ఇంక పనేఁవిటుందిలెండి - ఆ కాస్త పనీ ముగించుకొని 'కుసుమహర' దగ్గరికి వెళ్ళేసరికి హోటల్దగ్గర భూపతిగాడు కనిపించేడు.

భూపతిగాడు ఇవతల నా దగ్గర కానీ పరకా పుచ్చుకొంటూనే రహస్యంగా పులికి పని చేస్తున్నాడని నాకు తెలిసింది. నాకు తెలిసిందని వాడికి తెలిసిందని కూడా నాకు తెలిసింది. కాని ఆ విషయం గురించి మేం ఏమీ మాట్లాడుకోలేదు. పులేజెంటుగాడి పరిచయం అయాక భూపతిగాడిక్కూడా ఏదైనా అమెరికన్ కాఫీ గుండకో, టీ గుండకో బీడీకో దేనికో ఓదానికి ఏజెన్సీ సంపాదించాలనే ఆశ కలిగిందని కూడా నాకు తెలిసింది. నేనంటే వాడికి ఇష్టంపోయింది. వాడంటే నాకు కోపం వచ్చింది. పులి మహిమ వాడిక్కూడా కొంచెం అంటుకున్నట్టుగా గొప్పపడిపోతున్నాడని నేననుకున్నాను.

ఆ రోజున 'కుసుమహర' దగ్గర వాణ్ని చూడగానే నాకు చెడ్డ అసహ్యం వేసింది. కోపం వచ్చింది. వాడితో మాట్లాడ్డం మానేస్తేనో అని ఆలోచిస్తూండగా వాడు నన్ను అభిమానంతో పలకరించినట్టుగా "ఆఁ ఇదిగో! రా ! రా !" అంటూ నవ్వుతూ ఆహ్వానించి, వెంటనే

"పదవయ్యా బాబూ! లోపలికి దారితియ్యి ముందు!" అంటూ మిస్చివస్‌గా నవ్వేడు. ఆ నవ్వు చూసి నాకు మరీ చిరాకు వేసింది. "ఈపూట టోపీ వెయ్యడానికి దొరికేడో వెర్రి వెధవ!" అన్నట్టుగా ఉంది ఆ నవ్వు.

పగలు పదిగంటలయింది. మేకలమీద పులి విరుచుకు పడిపోయినట్టు ఎండ విరుచుకు పడిపోయి ఊరంతటిని తినేస్తోంది. హోటలు నీడలో కూర్చొని చాలా మంది ఫలహారం సేవిస్తున్నారు. డబ్బులు చాల్తాయా చాలవా అనే గొడవలో ఉండడంవల్ల నేను రెండిడ్లీ మాత్రం నెమ్మదిగా నన్ను నేను ఊరించుకు తిన్నట్టుగా తిని అరకప్పు కాఫీ అరగంట సేపు తాగేను. భూపతి ఇడ్లీ గబగబా తినేసి, దోసె దోసె పర పరలాడించేసి, నా ముఖం పరికించి వారగా చూసి, పెసరట్టుకూడా ఆర్డరిచ్చేడు. నేను రష్యా అంత రావాదోసెలు మూడైనా తినాలనే మూడ్‌లో ఉన్నాను. తినక పోవడం వలన చాలా చిరాకులో ఉన్నాను. ఇటు చూస్తే భూపతిగాడు పెసరట్టుని నిదానంగా తింటున్నాడు. మేకనీ గొర్రెనీ ముందు భక్షింపచేసి గేదె గొడ్డుని తీరుబాటుగా తినే ముసలి పులిలాగ అటు చూస్తే గోడని స్మోకింగ్ టైగర్ని వుల్లిపొరలే దుస్తులుగా ధరించిన అమ్మాయి కళ్లు మూసుకుకావలించుకొంటోంది. ఆ టైగర్ని అమ్మాయినీ కలిపి చితగ్గొట్టాలన్నంత కోపంతో వున్నా నేను.

ఆ తరువాత, కొంతసేపటికి భూపతిగాడు కాఫీ పూర్తిచేసి, పెదవులు బాగా చప్పరిస్తూ, "ఏదయ్యా నీ గొర్రె!" అని ముప్ఫత్‌గా నా దగ్గిర గొర్రెని తీసుకు కాలుస్తూ.

"పులిమజా గొర్రెకి ఎక్కణ్ణించొస్తుందయ్యా! పులి పులే, గొర్రె గొర్రే!" అన్నాడు.

అంతవరకూ సన్నగా రాజుకొంటున్న నా కోపం అతని మాటలకి పొగలు చిమ్మింది. పులియెడలా వాడియెడలా నాకు ఎన్నడూ కలగనంత ద్వేషం కలిగింది. వాడేమో సరిగా కనిపెట్టినట్టులేదు. లేక, కనిపెట్టేడో?!"

"ఛ! ఏం గొర్రెయ్యా? కంపుగొర్రె! పులి సొగసు దీనికెక్కణ్ణించొస్తుంది?! పులి దర్జాముందు యెర్రి గొర్రెలాగవు! యెయ్యి గొర్రెలైనా పులిన్జూసి వరుగులెత్తిపోవా లన్నమాటే!"

అని తాజుగా అన్నాడు, భూపతిగాడు.

నేను కుతకుతలాడుతూ కూర్చున్నాను. తాజుగా స్టార్టుచేసిన బండీకి స్పీడెక్కించేడు భూపతి. తాజుగా మొదలుపెట్టి, నాలుగు మాటల్లోనే తీవ్రమైన ఆవేశంలో పడిపోయేడు.

'యెధవ గొర్రెకున్నావు కాని పులికైనా ఏజెంటుగా ఉన్నావు కావు, పులేజెంటుని చూడు! ఎంత దర్జాగా చిరుతపులిలా ఎలా ఎగురుతాడో చూసేవు కద! నువ్వు యేయ్యి చెప్పు లచ్చ చెప్పు ! పులికి తిరుగు లేదు. దాని అరుపెప్పుడైనా ఇన్నావా ! కొండలు గజగజలాడతాయి! అరుపు ఇనిపించిందంటే అడివంతా కాలీ అన్నమాట. దాని దెబ్బకి దాటికి ఆగితే సింహం ఆగాలేమోగాని మరోటాగలేదు! నీ గొర్రెల్నీ గిర్రెల్నీ పులుసులో పనసకాయ ముక్కల్లానవిలేస్ది! గొర్రెలూ గిర్రిలూ కూలి యెధవలైతే పెద్ద పులి చెక్రవర్తన్నమాట ! మైల్దూరంల పులుందంటే కొమ్ములిరిగిన కారుదున్నే అయినా దండఁవెట్టి దౌడు తియ్యాల్సిందే! పులి చూపెప్పుడైన చూసేవా? చూసేవంటే మర్చిపోవు. చచ్చిందాకా రోజిడిచి రోజు కల్లో కనిపిస్ది! పులిదెబ్బో!!

దాని దెబ్బతిని రుచెలాగుంటుందో యేంటో చెప్పగలిగిన మనిషైనా జంతువైనా ఉంటుందేమో చూపించు చూదాం! పంజా విసిరిందంటే ఐరా(వ)తం అయినా సరే నెత్తురు కక్కుకు చావ్వల్సిందే! దెబ్బకి ఠాఁ! దాని దెబ్బకంత సత్తువుండబట్టే, ఎవడి గురించైనా "ఆడు పులిలాగుంటాడ్రా!" అంటే ఆడికంత గౌరవం. ఆడుపులీ అంటే ఆడు "పిడుగూ!" అన్న మాట. ఆడి దెబ్బకి దెయ్యం జడుస్తున్నమాట. ఆడికంతా చేతులెత్తి దండఁ పెట్టాలన్నమాట. అంతేకాని, ఎవణ్ణయినా చూసి "ఈడు గొర్రెలా ఉన్నాడ్రా" అంటే ఆడు యెర్రి యెధవన్న మాట! ఆడి పెళ్ళం వాడకల్లా ఒదినన్న మాట. కూర్చున్న బోడి ముండైనా ఆణ్ణి చూసి లేచి నిలబడదన్న మాట. అలాటాళ్లంతా పులికాలికింద బతకాలన్న మాట. పెద్ద పులి తిన్నగెళ్ళి కుర్చీలో కాలుమీద కాలేసుకు హుక్కా పీలుస్తూంటే మీ గొర్రెలూ మేకలూ ఎళ్ళి చాకలి పనీ మంగలిపనీ చచ్చుడిపనీ చేస్తూ దానికి చాకిరీ చేస్తూ బతకాలన్నమాట....."

వాడికీ నాకు కూడా ఆ సమయంలో ఎందువలనోగాని పిచ్చెక్కింది. సందేహంలేదు. ఆ సమయంలో నాకు వాణ్ణి చంపేదాం అనిపించింది.

"ఛీ! నోర్ముయ్!" అన్నా నేను. అలా ఎలా అనగలిగేనా అని ఆ తరవాత నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

భూపతిగాడి మాటలాపేసి గుడ్లు పెద్దవి చేసి, గండుపిల్లి ముదిరిన తొండని చూసినట్టు నావైపు ఆశ్చర్యంతోనూ కోపంతోనూ చూసేడు. ఆ తరవాత.

"అబ్బ ! గొర్రెలమ్ముకొంటేనే నీ కంత కళ్ళు నెత్తి కెళ్లేయి! పులుల్నమ్మితే నీకెంత తెగులొచ్చునో(రా! నన్ను నోర్ముయ్యమన్నావు! మరింక నువ్వు కూడా నీ గొర్రెల్లాగే చస్తా వురా!" అంటూ కేకలు వేసేడు వాడు.

దూరం నుంచి ఏదో బాండు మేళం వినిపిస్తోంది. ఆ బాజాల చప్పుణ్ణిమించడానికి వాడు గట్టిగా అరవ్వలసి వచ్చింది.

భూపతికి ఆ రోజున ఎందుకంత ఆవేశం వచ్చిందో సరిగ్గా చెప్పడం కష్టం. జీవితంలో అతను చాలా దెబ్బలు తిని చెడిపోయేడనేది స్పష్టం. అయితే, చింత చచ్చినా పుల్ల మాత్రం చావలేదు. మానవుల్లో కూడా పులులూ మేకలూ ఉంటాయని నాలాగే అతను కూడా ఆ రోజుల్లోనే ఆలోచించి నిశ్చయం చేసుకున్నట్టున్నాడు. పులేజెంటుగాడికి ఉండే లక్షణాలన్నీ తనకీ చిన్నప్పుడు ఉన్నందుకు అతను గర్వించేదే కాని, తను చివరికి చెడిపోయిన ముసలి పులి నయిపోయినందుకు అతను కుతకుతలాడుతున్నాడని నాకు తోచింది. పులిలా రాజులా బతకవలసిన తను, కర్మ చావులేక చివరికి గతిలేక గొర్రెల్నీ మేకల్నీ యాచించుకు బతక వలసివచ్చినందుకు ఆరోజున అతను చాలా బాధపడ్డాడనీ, అవమానాగ్నిలో మండిపడ్డాడనీ నేననుకుంటాను. నావంటి గొర్రె వెధవల కంటె నిజంగా తనెంతో సుపీరియరనీ, అధికుణ్ణనీ నాకు చెప్పచ్చుక్కొట్టినట్టుగా తెలియజేదామనే వెర్రి తలంపు అతన్ని పిచ్చి ఆవేశంలో ముంచిందని నేననుకుంటాను.

అతను అటువంటి పిచ్చి మూడ్‌లో ఉంటే, నేను వెర్రిగా గొర్రెల్ని పట్టుకొని ఆ

భూపతినొక పులిగా జమకట్టి ఆ పులి నెలాగైనా చంపేదాం అన్నంత ఆవేశంలో పడిపోయేను. ఆ సమయంలో నేనతణ్ణి నిజంగా నా పరమ శత్రువుని చూసినట్టుగా చూసేను. ఆమాంతంగా ఆ నిమిషంలో మేం ఇద్దరం జంతువులమే అయిపోతే కటుక్కున ఆ నిమిషంలోనే ఒకరి మెడ నొకరం కొరికేసుకొందుమన్నమాట.

"చస్తే చస్తాయి కాని మా గొర్రెలు మీ పులులకి చస్తే చాకిరీ చెయ్యవు!" అని నేను గట్టిగా అరిచేను.

"చెయ్యకేం చేస్తాయిరా, వెధవ గొర్రెలు? మీ గొర్రెలకి మెడలు కొరికేసి పేగుల్తీసేసి కస కస తినేస్తాంరా! నిమిషానికి వంద గొర్రెలు సఫా!" అని అతనరిచేడు.

"షటప్!" అని కేకవేసేన్నేను.

బాజాల చప్పుళ్లో నేను గొంతుక చించుకోవలసొచ్చింది. హోటల్లో అంతా మమ్మల్ని వింతగా చూస్తున్నారనికూడా నేను తెలుసుకోలేదు.

"నోర్మూయ్!" అని గావు కేక వేసేడు భూపతి. వాణ్ని కొట్టేద్దాం అనుకున్నాన్నేను. ప్రజలకి గవర్నమెంటు మీద కోపంవస్తే పోలీసువాళ్ళని చితక్కొట్టినట్టు పులిమీద కోపంతో వాణ్ని కొట్టామనిపించింది నాకు.

అంతలోవాడు మళ్ళీ అందుకున్నాడు.

"పులంటే మజాకా కాదురా! పులంటే బుద్ధుడూ, ఏసుక్రీస్తూ, గాంధీమహాత్ముడూ కాదురోరే! కాదు! తినేస్తుంది. తినేస్తుంది. ముసోలినీగాడు అబిసీనియాని తినేసినట్టు పులి మిమ్మల్ని తినేస్ది! జాగర్త! నేనిట్టే దోసే పెసరట్టు నవిలేసినట్టు మిమ్మల్ని నవిలేస్ది .... "

అంటూ వాడు ఆగిపోయేడు!

చచ్చిపోయాడేమోనని భయపడ్డాన్నేను. నోరు తెరుచుకుండి పోయింది. గుడ్లు పెద్దవయి పోయేయి. బొమ్మలా కొంతసేపు అలా ఉండిపోయి, ఆ తరవాత మరబొమ్మలా చెయ్యిజాచి, "చూడు! .... ..... చూడు! .... పులి ... పులి !! " అంటూ దెయ్యాన్నో దేవతనో చూపించినట్టు రోడ్డువేపు చెయ్యి చూపించేడు వాడు.

వాడు - అతను - రోడ్డువైపు ముఖం ఎదురుగా కూర్చున్నాడు. రోడ్డు నాకు వెనగ్గా ఉంది. అతనాలా బొమ్మలా మారిపోయి మరబొమ్మలా చెయ్యి జాసేసరికి నేను ఆ దిక్కుకి, అంటే వెనక్కి తిరిగి వీధిలోకి చూసి, నాలుగు సెకండ్ల సేపు కొయ్యబారిపోయి అలా ఉండిపోయేను.

నిజంగా పులే అక్కడుంది!

"పులి, పులి, పులిన్నూడు! దాని దర్జా దాని ధీమా, దాని ఠీవి, దాని డాబు ఏలా ఉందో చూడు. రాజులా ఉంది చూడు. నీ గొర్రెలిప్పుడు పట్రా! ఒచ్చి చూస్దేమోచూడు ... పులెలాగుందో చూడు!"

రోడ్డు మధ్య బోనుబండిలో పులి కూర్చోనుంది. దాన్ని బాజాల్తో ఊరేగిస్తున్నారు. పులి కంపెనీ వారే అడ్వర్టయిజుమెంటుకోసం పులిని ప్రజలమధ్య పడేసేరేమో అని అనుకున్నాను.

కాని, దాన్ని తీసుకు వచ్చింది వారుకాదు. ఊరికి ఏదో సర్కస్ కంపెనీ వచ్చింది ఆ సాయంకాలం నుంచీ సర్కస్ ప్రారంభం. వాళ్ళ సర్కస్ అడ్వర్టయిజుమెంటుకోసం వాళ్ళు పెద్దపులిని బోన్లో పెట్టి ఊరేగిస్తున్నారు. ఆ బోను పైన అట్టాకటుంది. దాని మీద వచ్చీ రాని వారు వ్రాసిన తెలుగు అక్షరాలున్నాయి. కూడబలుక్కుని చదువుకొని అర్థం చేసుకుంటే దాని అర్థం యిది. నెల రోజుల కిందట అడవి నుంచి పట్టి తెచ్చిన అధ్భుతమైన కొత్తపులి!"

మా యుద్ధ సంభాషణ సాగుతూండగానే మధ్యలో పులి ప్రత్యక్షమవడంతో నేను ముందు కొంచెం షాక్ అయేను. ఆ తరవాత ఆ పులిని నిదానంగా చూసేను. ట్రాఫిక్ జంక్షన్ దగ్గిర ఎందుకోగాని ఊరేగింపు ఆగింది. బాండుమేళం ఆపేరు. బండిచుట్టూ చాలా కోలాహలంగా ఉంది. పెంకె కుర్రాళ్లు దగ్గరగా వెళ్ళి దాన్ని చూసి గెంతుతున్నారు. కేకలు వేస్తున్నారు. కొంతమంది దాన్ని వెక్కిరిస్తున్నారు.

ఆ పులి మాత్రం చుట్టూ ఉండే గొడవలకి కేర్ చెయ్యకుండా టెంపరరీగా జెయిల్లో కూర్చున్న మహారాజులా గంభీరంగా కూర్చుంది. ముందు కాళ్ళు ముందుకి చాచుకునీ, తల ఓ పక్కకి తిప్పి ఠీవిగా నిశ్చలంగా కూర్చొనుందది. నల్లచారల వల్ల దాని పసుపురంగు ఎక్కువగా మెరుస్తోంది. ఆ పులి అతి నిర్దయగాను, ఎంతో నిర్భయంగానూ కనిపించింది నాకు. దాన్లో అందం కూడా లేకపోలేదు. కాని అది పడగెత్తిన పాములోని అందంలాంటిది. నిప్పుకి ప్రాణం వస్తే అది పులిలా ఉంటుందనుకుంటాను. ఆ పులి నా కంటికి ఒక మనోహరమైన పిశాచంలా కనిపించింది.

ఆ పులి ఓ సారి ఆవులించి కళ్లుమూసుకొని మళ్ళీ కళ్ళు తెరిచింది. దాని కోరలు చూస్తే నాకు భయం వెయ్యలేదు! అసహ్యం వేసింది.

నేను తళతళ మెరిసే కత్తుల్ని చూసేను. కత్తులకు పాప పుణ్యాలతో సంబంధంలేదు. కాని, కొన్ని కత్తుల్ని చూస్తే అక్కసు కలుగుతుంది. మరికొన్నిటిని చూస్తే ముచ్చట వేస్తుంది. శ్రీరాముల వారి విచ్చుకత్తి ఎంత భయంకరంగా ఉన్నా అది చూడ్డం నాకు ఇష్టంగానే ఉంటుంది. ఏ మారీచుడో మాన్‌సింగో, ముసోలినీవో ఉపయోగించే కత్తులు చూస్తే నాకు అక్కసు కలుగుతుంది. నాకు ఆ రోజున ఆ పులి కోరలు చూస్తే అక్కసు కలిగి అసహ్యం వేసింది. ఆ కోరలు కరడుగట్టిన పాపాల్లా ఉన్నాయి. ఆ కోరలు తీసేసి వాటితోటే ఆ పులిని పొడిచి చంపాలనిపించింది నాకు.

"చూసేవా! దాని కోరల్చూసేవా? ఇనుమునికూడా కటుక్కున కొరికేగల్దు! కోరలు కావవి! కత్తులు, వొజ్రపు కత్తులు!" అని నోరంతా ఊటలూరగా చెప్పి చూపించేడు భూపతి.

ఆ పులి బండీకి వెనకనీ పక్కలంటాకూడా పిల్లలూ, పెద్దలూ అంతా నిల్చుని పులిని వింతగా చూస్తున్నారు. బండీకి వెనకపక్కని ఉన్న గుంపు ముందు నిల్చున్న ఓ పదేళ్ళ పచ్చటిపిల్ల చిలకాకుపచ్చ పరికిణీ మీద బంగారు రంగు కచ్చుతొడుక్కుంది. ఆమె ముఖంలోని పసితనాన్నీ అమాయకత్వాన్నీ, ఆమె కళ్ళు - పెద్దవి, కాటిక పూసుకున్నవి - ఇనుమడింప జేస్తున్నాయి. చిన్న పిల్లే అయినప్పటికీ ఆమెకి ముక్కు కుట్టించి ఎర్రటి పొడి ముక్కు పుడక ఉంచేరు. తన పక్కనున్న - చిన్నన్న అయ్యుంటాడు - అతన్ని ఓ చెయ్యి చుట్టి పట్టుకొని,

ఆమె భయంగా ఆశ్చర్యంగా ఆ పెద్ద పులిని కళ్లు విప్పార్చుకొని చూస్తోంది. ఆ పులిని ఆ పిల్లనీ చూస్తే నాకు మృత్యుమూర్తిని పిల్ల చిలుక చూస్తున్నట్టనిపించింది. ఆ ఎండలో ఆ పులిని చూసి అదిరిన ఆ పిల్ల చిలకని చూస్తే నాకు విపరీతమైన జాలి కలిగింది, ఎందుకోగాని నన్ను నిరాశ ముంచేసి ఉక్కిరి బిక్కిరి చేసింది.

అంతలో బాజాలు మళ్ళీ అందుకున్నాయి. బండీ కదిలింది. పులి మా దృష్టిపథంలోంచి పక్కకి పోయింది. పిల్లలంతా దాని వెనక దాంతో పాటు తిరిగిపోయేరు.

"ఏఁవంటావు?" అన్నాడు భూపతి. తన పాయింటు ఠంచన్‌గా నెగ్గిందన్న ధీమాతో.

"మీ పులి దర్జాగానే ఉంది" అని నేను వప్పుకున్నాను.

"అద్గదీ! అలా సబవుగా వప్పుకున్నావు. మంచివాడివి. చెప్పింది నీకిపుడు బోధపడిందా? కంటిక్కనిపించిందా? నాకైనా నీ గొర్రెలంటే పగటయ్యా. పులి పేరు మీద గొర్రెలు ఎక్కవయ్యా అన్నానంతే! కంపెనీ వోడికి బుద్ధిలేకపోతే నువ్వేంజేస్తావు? నా మాట ఇని గొర్రె తోక పట్టుకు ఏళ్ళాదక మునిగినోణ్ని పట్టుకుంటే అదు నిన్ను ముంచేస్తాదేతప్ప తేలుస్తాదా ? నా మాట ఇని ఎవుణ్నయినా పట్టుకుని పులి కంపినీలో చేరిపో! బావుపడతావు. నామాటిను. నీ మంచికోసరవేఁ ఇందాక అలా కేకలేసేను. ఏం టనుకోకు. జెయించేవోడి జెండాకింద నీడ దొరుకుద్దిగాని ఒరిగిపోయే జెండాకింద నీ కేంటి దొరుకుద్ది? .... " అంటూ అతనేదేదో చెప్పుకుపోతున్నాడు. నేను వింటున్నట్టే వింటూ ఏదేదో ఆలోచిస్తున్నాను.

అడవిలో అయితే పులిదే రాజ్యం. కాని, మనిషి జీవితంలో కూడా అదే పెత్తనం చేస్తే ఎలాగ ! మనిషి న్యాయం వేరు. పులి న్యాయం వేరు. పులయితే దొంగదెబ్బ తీస్తుంది. పెద్ద జంతువుకి; జబర్దస్తీ చేస్తుంది చిన్న జంతువుని, దాని కడుపుకోసం, దాని స్వార్థం కోసం పాపపుణ్యాలతో సంబంధం లేకుండా అది ఏంచేసినా చేస్తుంది. మానవ జీవితంలో మనిషి నెగ్గాలన్నాకూడా అవే పద్ధతులా ? చేస్తే మోసం, కాకపోతే జులుం - ఇవేనా మానవ కల్యాణానికి మార్గాలు ?

అని ఆలోచిస్తూండగా నాకు ఆ చిలకవంటి పిల్ల గుర్తుకి వచ్చింది. ఆ పులి చూపూ ఆ పిల్ల చూపూ జ్ఞప్తికి వచ్చి, "అరె! ఇదా జీవితం"! అనిపించి నాకు భయం వేసింది.

ఏదేదో చెప్పుకుపోతోన్న భూపతి, చివరకి

అంచేత, గొర్రెలెప్పుడూ పులికి బలే! అనే తిరుగులేని పరమ సత్యం నాకు తెలియచేసి,

"ఏవంటావు?" అని నన్ను నిలదీసినట్టుగా ప్రశ్నించేడు.

నాకు కోపం అంతా పోయి, బారుగా నవ్వొచ్చి "అందుకే గొర్రెలెప్పుడూ పులుల్ని నమ్మకూడదూ అంటాను!" అన్నాను.

భూపతి కూడా హాపీగా నవ్వేసి.

"బాగా చెప్పేవు! మరైతే, మరో అరకప్పు కాఫీ కొడదాఁవాఁ?" అన్నాడు.

"కొడదాం" అన్నాన్నేను.

ఇద్దరం మళ్ళీ భాయీ భాయీలం అయిపోయేం. కాని, మేం కాఫీ మళ్లీ ఆ పూట

తాగలేదు. తాగడానికి పెద్ద అంతరాయం వచ్చింది.

మనుష్యులు పరిగెడుతూ చేసే శబ్దం ఒక్కొక్కప్పుడు చాలా భయంకరంగా ఉంటుంది. ముందు, నాకు అడుగుల చప్పుడే వినిపించింది. ఎక్కడైనా ఇళ్లు కాల్తున్నాయో, కూల్తున్నాయో లేక యే కాంగ్రెసువాళ్ళ మీదైనా లాఠీచార్జీ జరుగుతూందో అనుకున్నాను. అంతలోనే, ఆ పరిగెట్టే జనం గొల్లున గోలచేస్తూ పరిగెట్టేరు. ఆ గోలలో ఎవరు వేసేరో కాని, దశకంఠుల్లా, "అమ్మో! పులి!" అని పెను కేక వేసేడు.

సంగతేమిటోనని హోటెల్ గుమ్మందాకా వెళ్ళిన వారు ఆ కేక విని, దబ్బున ఒకరి మీదొకరు పడిపోయేరు. హోటెల్ ప్రొప్రయిటరు కుర్చీలోంచి గుభీమని పడిపోయి గభీమని స్ప్రింగులా లేచి, డస్కులోని నోట్లకట్ట తీసి పట్టుకొని, ఆ నోట్ల కట్టనీ తన నూటడెబ్బయి పౌన్ల బరువునీ ఎక్కడదాచాలో తెలియక, అటూ ఇటూ గాభరాగా తిరిగి ఆఖరికి ఆ బల్లకిందే ఇరుక్కుని కూర్చున్నాడు. కొండ విరిగితే రాళ్లు తుళ్లి దొర్లినట్లు రోడ్డునుంచి ఓ వందమంది జనం హోటెల్లోకి దడ దడమని వచ్చేసేరు. వార్లో ఎవరోకాని తలుపులు ధన్నుమని మూసేసేరు. బైటని ఉండిపోయినవారు బడబడ తలుపు తట్టినా ఎవరూ తియ్యలేదు. నాక్కూడా భయం వేసింది. "భయం ఏమిటి? ఛీ!" అనుకున్నానే కాని భయపడ్డాను.

కాని, ఆ భయంలోనే నాకు నవ్వొచ్చింది.

భూపతి గడగడలాడకపోతే అతను కొయ్యబారిపోయి చచ్చిపోయేడని నేననుకొని ఉండేవాణ్ణి. అల్లుణ్ణి చూసి భయపడ్డ కంసుల్లా తోచేడు నాకు ఆ సమయంలో అతను.

"పులి పులి" అనే మాట, మంచులో నిలబడి "చలి చలి" అన్నట్టుగా అన్నాడతను.

"పులి పులి ఇలా ఒస్తే" అని వజ వజ వణుకుతూ అడిగేడతను.

"అలా అలా అంటూ పారిపోతావు." అని వెనక్కి తోవ చూపెట్టేనతనికి.

వడవడ వణుకుతూన్న మనిషి అంత వడివడిగా పరిగెట్టగలడని నేననుకోలేదు. అతని నెత్తిమీద పండుజుట్టులేచి నిలబడింది. చేతి కఱ్ఱ విడిచిపెట్టేసి చేతులూపుకుంటూ గబ్‌గబ గబ్‌గబా వంట గదిలోకి పరిగెట్టేడతను. అక్కడికి నేనుకూడా వెళ్లేను. అక్కడ హోటల్ పొయ్యిలు భగభగ మండుతున్నాయి. ఆ "పులి గాభరాలో" ఆ ముసలాడు ఏ నిప్పులోనో నూనెలోనో పడిపోతాడేమోనని నేను భయపడ్డాను. అక్కడ పొగ, నూనే, కుల్లు కంపుల మధ్య గోడవార ప్రాణాలు బిగబట్టుకు నిలబడ్డాడతను. అక్కడ ఓ నల్లని నల్లుల్లాంటి మనుషులున్నారు. పులొస్తే బెదిరించడానికి కాబోలు ఆ వంటవాడు కాలే కొరకంచొకటి పట్టుకొని సిద్ధంగా నిలబడ్డాడు.

రెండు మూడు నిమిషాలు యుగాలయింది. అంతలో మరొకడు ఆ వంటగదిలోకి వెనకదారంట వచ్చి వగర్చుకొటూ కూలబడిపోయేడు. వెనక దారి కూడా బంద్ చెయ్యడానికి మరో వంటవాడు పరిగెట్టేడు.

వగర్చుకుంటూ కూలబడినవాడు చాలా చిన్నకుఱ్ఱవాడు. పదిహేనేళ్ళ వయసుంటే ఉండవచ్చు. అతి మాసిన నల్ల నిక్కరు మీద అతి చింకి బనియను తొడుక్కున్నాడు. అతని

జుట్టు కత్తిరించిన కర్రి గొర్రె బొచ్చులా ఉంది. ముఖం చూస్తే ఎండు పొట్టేలు ముఖంలా మాడిపోయి ఉంది.

ఆ కుర్రాడు వగర్చుకుంటూ చెప్పేడు!

"చిన్నబాబా మిటాయి కొట్టుకాడ మలుపుంది కదా అక్కడ మున్సిపాల్వోళ్ళు పైపుగొట్టావేసేసి గొయ్యిలు కప్పెట్టకుండ ఒగ్గేస్తే అందల పడిపోనాది సెక్కరం! సెక్కరం పడగానే బండి బోల్తాకొట్టేసినాది. బండి తిరగబడిపోగానే నానప్పుడు సిట్టెమ్మ కొట్టుకాడ ఇరిగిపోయిన అరుగు సప్టామీన నిలబడ్డాను - బండి తిరగబడి పోగానే - బండంటే బోను బండన్న మాట! బండి తిరగబడిపోగానే బోను తలుపులిడిపోనాయి. తలుపులిడిపోగానే సెంగుమని రోడ్డెక్కిపోనాది పులి! రయ్యోరయ్య! జెనం గోలేటో సెప్పనేం? దీపాలమాసకి కోఁవిఁటోడి మందు గుండుకొట్టు పేలిపోనా దెరికా? కొట్టు పేలగానే ఆయాల జనం ఎగిర్నారెరిక? బోన్లొంచి ఈదిలోకి పులెగరగానే జెనం అలా గోలెట్టి ఎగిర్నారు! నానంతా సూస్తున్నానేగాని, చినిమా జూస్తున్నట్టు సూస్తా ఉండిపోన్ను! అదంతా మనముందర ఈదిలోనే జరుగుతున్నదని లంగరందలేదు. అంతట ఆ పులి అందుకుందిర నాయనా!! ఎండు గెద్ద కోడి పెట్ట నందుకున్నట్టందుకొంది! పిల్ల మా సెల్లమ్మలాగుంది. మా సెల్లమ్మే సెల్లమ్మ. పిల్లే పిల్ల. పదేళ్ళుంటాయో ఉండవో అయితే. మా సెల్లి కచ్చులంగా ఎయ్యదు. గోసెఎడ్డద్ది. ఆ పిల్ల పసుప్పచ్చ కబ్బా ఏసి ఆకుపచ్చ లంగా ఏసిందేమో - సిలక పిట్టని గండు పిల్లి కరుసుకున్నట్టే - సరిగ్గలాగ్గ పిల్లని లంకించుకు నోట్లెట్టుకొని ఒక్క గెంతు గెంతినాదంతే! అప్పుణ్నాకు చినిమా కాదరా నాయనోరే! అని అంటుకున్న కళ్ళు ఇర్థం ఏటి, వెంటనే [illegible] ఎగరడం ఏటి ?!".

ఆ కుర్రవాడు ఆ వృత్తాంతం అంతా ఎంతో భయపడుతూ చెప్పినా కళ్ళులేని రాజుకి కౌరవయుద్ధం గురించి చెప్పినట్టుగా ఎంతో ఆసక్తితో చెప్పేడు.

ఆ సంగతి వినగానే నాకు తల గిర్రున తిరిగింది.

ఆ సమయంలో నన్నెవరో వెక్కిరించినట్టనిపించింది. నా కళ్ళకి ఎదురుగా ఉన్న ఆ కణకణలాడే నిప్పుల్లో ! నా కంటికి కనిపించని దుష్టశక్తేదో, అప్పుడు పుట్టిన చిలకని తెచ్చి పడేసి అది ఆ నిప్పుల్లో కాల్తుండగా "చెయ్యి నువ్వేం చేస్తావో చెయ్యి!" అని నన్ను చాలెంజి చేసినట్టుగా నాకు అనిపించింది. ఆ నిప్పుల్లో నేను పులి కళ్ళు చూసేను. నాకు ఆకళ్ళు పొడిచేసి, ఆ నిప్పు లార్పేసి, ఆ విధంగా పచ్చటి ప్రాణాన్ని నిప్పుల్లో పడవేసే ఆ దుష్టశక్తిని పట్టుకొని చిత్రచిత్రంగా వధచెయ్యాలనిపించింది; మరింక రూపు లేకుండా ధ్వంసం చేయాలనిపించింది.

కళ్ళంట నీళ్లు నిప్పులుకూడా రప్పించే భోగట్టా చెప్పేడు మాకు ఆ కుర్రవాడు.

ఆ రోజున ఆ పిల్ల ఆ పులినోట్లో ప్రాణాలు విడిచింది. ఆ రోజున ఆ పులికూడా ఎవరో తుపాకీతో కాల్చగా చచ్చింది. ఆ రోజున ఆ పులిమీదకంటె భూపతిగారికి నామీద ఎందుకోగాని, ఎక్కువ కోపం వచ్చింది. ముఖం చిట్లించుకుని రుసరుసలాడ్తూ నాతో

మాట్లాడకుండా నా వైపుచూడకుండా వెళ్ళిపోయేడతను.

ఆ రోజు గడిచి చాలా రోజులయింది. ఆపిల్ల పోయింది. ఆ పులి చచ్చింది. ఆ పులివెనకా ఆ పిల్లవెనకా భూపతికూడా ఏనాడో వెళ్ళిపోయేడు. ఆ రోజు గతించి ఇప్పటికి ముప్ఫయ్యేళ్ళయింది. చాలా కాలం అయింది. కాని, ఆ రోజున జరిగిన అన్యాయం మాత్రం ఇప్పటికీ అలానే ఉంది. అది ముప్ఫయ్యేళ్ళనాటిదేకాదు, తరతరాలనించి యుగ యుగాలనుంచి జరుగుతున్న అన్యాయం అది!" ఈ అన్యాయం ఇంకెంత కాలం, ఇంకా ఎంతకాలం నిలబడుతుందో, ఎప్పుడు ఎవరొచ్చి ఈ అన్యాయమానవుల మధ్య మరింక జరక్కుండ దాన్ని తుదముట్టిస్తారో కదా!" అనిపిస్తూంటుంది నాకు. ఈ అన్యాయం ఎప్పుడో ఒకప్పుడు తప్పక అంతమవుతుందని నాకు ఒకసారి ఆశ కలుగుతుంది; అంతమవదేమోనని ఇంకొకసారి నిండా నిరాశ నిండుకుంటుంది.